Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..
epaper.telanganaveena.com హైదరాబాద్ ఆదివారం 23.06.2024

స్పాట్ ఎడిషన్

## ఉద్రిక్తతకు అసత్య ప్రచారమే కారణమా..?

## మియాపూర్‌లో ఏం జరిగింది..

తెలంగాణవీణ, హైదరాబాద్



హైదరాబాద్ మియాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దీప్తిశ్రీనగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వేలాది మంది గుడిసెలు వేయడం... విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ఖాళీ చేయించేందుకు అక్కడికి వెళ్లడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం దాడికి కారణమైంది. పోలీసులపై రాళ్లు రువ్వారు ఆందోళనకారులు. కర్రలతో దాడి చేశారు. అయినప్పటికీ భారీ బలగాలతో వచ్చి ఎట్టకేలకు స్థలాన్ని ఖాళీ చేయించారు పోలీసులు.శేరిలింగంపల్లి మండలం దీప్తిశ్రీనగర్‌లో ఉన్న 100,101 సర్వే నెంబర్లు గల సుమారు 500 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని పేదలకు కేటాయిస్తున్నారన్న ప్రచారం గట్టిగా జరిగింది. వాట్సాప్‌లో మెసేజ్‌లు పెద్ద ఎత్తున సర్క్యులేట్ కావడంతో... రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. దాదాపు రెండు వేల మంది గుడిసెలు వేసుకుని... మూడు, నాలుగు రోజులుగా ఇక్కడే నివాసం ఉంటున్నారు. ఇక విషయం తెలుసుకున్న హెచ్ఎండీఏ అధికారులు, మియాపూర్ పోలీసులతో కలిసి వారిని ఖాళీ చేయించేందుకు వెళ్లారు. ముందుగా అక్కడి ప్రజలతో మాట్లాడేందుకు అధికారులు ప్రయత్నించారు. ఇది ప్రభుత్వ భూమని... ఇంకా ఎవరికి కేటాయించలేదని, ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని చెప్పారు. దీంతో ఆగ్రహించిన నిరసనకారులు హెచ్ఎండీఏ అధికారులు, పోలీసులపై దాడికి పాల్పడ్డారు.

గతంలో ఇది ప్రభుత్వ భూమి అని తెలియక పలువురు వ్యక్తులు కొన్నారని తెలిపారు రెవెన్యూ అధికారులు. ఈ భూమి ప్రభుత్వానిదని కోర్టు నిర్ధారించి హెచ్ఎండీఏ కు అప్పగించిందన్నారు. దీంతో ఈ భూమిని కొన్నవారు సుప్రీం కోర్టును ఆశ్రయించారని అధికారులు వెల్లడించారు. మరోవైపు పోలీసులు సైతం ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది నాయకులు సామాన్య ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, వారి పేర్లను త్వరలోనే చెబుతామన్నారు. స్థలాలు ఇస్తున్నారని ప్రచారం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 30 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నామన్నారు పోలీసులు.

### డ్రోన్లతో గస్తీ..

ప్రభుత్వ స్థలం నుంచి ఖాళీ చేయించినేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా.. మియాపూర్‌లో పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది.. ప్రభుత్వ భూముల వైపు ఎవరినీ అనుమతించడం లేదు.. నిన్నటి ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసుల ముందుజాగ్రత్త చర్యలుచేపట్టారు. వివాదాస్పద ల్యాండ్‌లో డ్రోన్లతో పోలీసులు గస్తీ కాస్తున్నారు..మొత్తంగా... మియాపూర్‌లోని హెచ్ఎండీఏ ల్యాండ్ ఇష్యూ రచ్చ లేపుతోంది. ప్రస్తుతానికి ఖాళీ చేసినప్పటికీ... తమకు కేటాయించేవరకు ఊరుకునేదే లేదంటున్నారు జనం. మరి ప్రభుత్వం ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తుందో చూడాలి.

## ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ..డిప్యూటీ సీఎం పవన్ కీలక ఆదేశాలు

## పారిశ్రామిక కాలుష్యంపైనా మంత్రి సమీక్ష





తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

ఎర్రచందనం స్మగ్లింగ్'పై ..డిప్యూటీ సీఎం పవన్ కీలక ఆదేశాలు– పారిశ్రామిక కాలుష్యంపైనా మంత్రి సమీక్ష

ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

రాష్ట్రం నుంచి నేపాల్‌కు తరలిపోయిన ఎర్రచందనాన్ని వెనక్కి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

అదే విధంగా కాలుష్య నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని పవన్ ఆదేశించారు.

కృష్ణా, గోదావరి నదీ జలాలు కలుషితంపై ప్రత్యేకంగా సమీక్షిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు
నేపాల్ దేశంలో 172 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం దొరికిందని మంత్రి స్పష్టం చేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడానికి టాస్క్ ఫోర్స్‌ను బలోపేతం చేస్తామని తెలిపారు.శాసనసభ హౌస్ కీపింగ్ సిబ్బంది డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ సమస్యలను చెప్పుకొన్నారు. హౌస్ కీపింగ్ సిబ్బంది మొత్తం అన్ని విభాగాల్లో కలిపి 154 మంది వరకు శాసనసభలో పనిచేస్తున్నామని, రాజధాని ప్రాంత రైతు కూలీలమని ఇక్కడ పనిచేస్తున్నారని చెప్పారు. 8 సంవత్సరాల కిందట రూ.6 వేలకు ఉద్యోగంలో చేరామని ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నారన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పరిధిలో ఉన్నామని తెలిపారు.హౌస్ కీపింగ్ ఉద్యోగుల సమస్యను ఆసాంతం విన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, తగు విధంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## శ్రీలంక అదుపులో 22 మంది తమిళజాలర్లు



తమిళనాడుకు చెందిన 22 మంది జాలర్లను శ్రీలంక నేవీ తాజాగా అరెస్ట్ చేసింది. సరిహద్దు దాటి చేపల వేట సాగించారనే కారణంగా నేదుండివు సమీపంలో వారిని అదుపులోకి తీసుకుంది. చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులను తరచూ శ్రీలంక అరెస్ట్ చేస్తోంది. భారీగా తమిళ జాలర్లను కస్టడీలోకి తీసుకుని, జైళ్లకు తరలిస్తోంది. శ్రీలంక నేవీ తీరుపై విమర్శలొస్తున్నాయి. మత్స్యకారుల విడుదలకు కేంద్రం చొరవచూపాలని తమిళులు కోరుతున్నారు.

## సహకార రుణాలు కూడా మాఫీ

## టెస్కాబ్

రూ.5,048.1 కోట్ల సహకార రుణాలు మాఫీ కానున్నాయని తెలంగాణ రాష్ట్ర కో– ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు వెల్లడించారు. 823 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని 7.75 లక్షల మంది చిన్న, మధ్య తరగతి రైతులకు చెందిన రుణాలు మాఫీ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. రూ.2లక్షల వరకు రుణాలను ఒకేసారి ప్రభుత్వం మాఫీ చేయడం చరిత్రాత్మకమని కొనియాడారు.



## ఇస్రో మరో ఘనత.. పుష్పక్ ప్రయోగం సక్సెస్!

పుష్పక్ అనే రీయూజబుల్ లాంచ్ వెహికల్ ల్యాండింగ్ ఎక్స్పెరిమెంట్ను ఈరోజు ఇస్రో చేసింది. ఇప్పటికే రెండు సార్లు ఈ ప్రయోగం చేసి విజయం సాధించగా.. మూడోసారి కూడా ప్రయోగం చేసి విజయం సాధించినట్లు ఇస్రో ప్రకటించింది.

## రేపటి నుంచి జూనియర్ డాక్టర్ల సమ్మె



తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణలో రేపటి (సోమవారం) నుంచి జూనియర్ డాక్టర్లు సమ్మెకు దిగనున్నారు. అత్యవసరమైనవి మినహా అన్ని సేవలను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఉపకార వేతనాలు సకాలంలో చెల్లించడంతో పాటు వైద్యులకు రక్షణ, ఉస్మానియా ఆస్పత్రిలో కొత్త భవనాల నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా గత రెండ్రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి జూడాలు నిరసనలు తెలుపుతున్నారు.

## రాజధాని పనులు ప్రారంభం.. మహిళా రైతుల పాదయాత్ర



ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి పనులు ప్రారంభమయ్యాయి. దాంతో మహిళా రైతులు పాదయాత్ర చేపట్టారు. తుళ్లూరు శిబిరం నుంచి విజయవాడ కనకదుర్గ ఆలయం వరకు మహిళా రైతులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మాట్లాడుతూ.. ఐదేళ్లుగా అనేక బాధలు పడ్డామని, గతంలో పాదయాత్ర అంటే చాలు పోలీసులు అడ్డుకునే వారి గుర్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతి ఊపిరి పీల్చుకుందన్నారు.

## లొంగిపోయిన మావోయిస్టు

## మోస్ట్ వాంటెడ్



మహారాష్ట్రలో మావోయిస్టు లకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మోస్ట్ వాంటెడ్ గడ్చిరౌలి జిల్లా మావోయిస్టు ఉద్యమ ఇన్‌చార్జ్ గిరిధర్ తుమ్రెట్టి అలియాస్ బిచ్చు ఈరోజు డిప్యూటీ సీఎం, పోలీస్ అధికారుల సమక్షం లో లొంగిపోయాడు. బిచ్చు భార్య సంగీత అలియాస్ లలిత కూడా లొంగి పోయింది. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సమక్షం లో లొంగిపోయారు. బిచ్చు లొంగుబాటుతో గడ్చిరౌలి జిల్లాతో పాటు మధ్య భారత్‌లోని మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలినట్ట యిందని పోలీసులు భావిస్తున్నారు. కాగా గిరిధర్ తుమ్రెట్టి 86 ఎన్‌కౌంటర్లు, 15 కాల్పుల ఘటనలో క్రియాశీలక పాత్ర పోషించాడు. బిచ్చుపై 25 లక్షల రూపాయల రివార్డు ఉంది. అనేక ప్రభుత్వ వ్యతిరేక ఘటనలో పాల్గొన్నందుకు 179 కేసులు ఉన్నాయి. 1996 నుంచి 2024 వరకు అనేక ఘటనల్లో వివిధ హోదాల్లో ప్రధాన సూత్రధా రిగా వ్యవహరించాడు...

## డీఎస్పీని కానిస్టేబుల్ గా డిమోట్ చేసిన యూపీ సర్కారు..



* మహిళా కానిస్టేబుల్ తో రొమాన్స్ చేస్తూ హోటల్ లో పట్టుబడ్డ డీఎస్పీ
* మూడేళ్ల కిందట మహిళా కానిస్టేబుల్ తో హోటల్ లో ప్రణయం
* భర్త కనిపించట్లేదని ఎస్పీని ఆశ్రయించిన డీఎస్పీ భార్య
* విచారణలో భర్త నిర్వాకం బయటపడడంతో షాక్

ఉద్యోగం మాత్రమే పెద్దది.. బుద్ధులు మాత్రం చిన్నవే.. అందుకే ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సదరు ఉన్నతాధికారిని చిన్న పోస్టుకు డిమోట్ చేసింది. ఏకంగా డీఎస్పీ ర్యాంకు నుంచి కానిస్టేబుల్ ర్యాంకుకు దిగజారాడా ఉద్యోగి. ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్ కు చెందిన మాజీ డీఎస్పీ కృపా శంకర్ కనౌజియా మూడేళ్ల కిందట ఓ మహిళా కానిస్టేబుల్ తో హోటల్ లో రొమాన్స్ చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో శాఖాపరమైన విచారణ జరిపించిన పోలీస్ శాఖ.. తాజాగా కృపా శంకర్ ను కానిస్టేబుల్ ర్యాంకుకు డిమోట్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## వైసీపీని అందుకే వీడాల్సి వచ్చింది ఘట్టమనేని ఆదిశేషగిరిరావు



సూపర్ స్టార్ కృష్ణ సోదరుడు, నిర్మాత, రాజకీయనాయకుడు ఘట్టమనేని ఆది శేషగిరిరావు తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన రాజకీయ ప్రస్తానం గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీ విభజన తరువాత కాంగ్రెస్ 90 శాతం ఓటు బ్యాంకు, నాయకులు వైసీపీ వైపు మళ్లారని, ఆ క్రమంలో తన అడుగులు వైసీపీ వైపు పడ్డాయని చెప్పారు. జగన్‌తో పార్టీ వ్యవహారాలకు సంబంధించి చిన్న భేదాభిప్రాయం కారణంగా తాను 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడాల్సి వచ్చిందన్నారు. జగన్ పార్టీ నడిపే విధానంతో విభేదించి టీడీపీలో చేరానని చెప్పారు. కానీ, వైసీపీలో ఉండగా పాదయాత్ర నుంచి పార్టీ నిర్మాణం వరకూ పలు అంశాల్లో క్రియాశీలకంగా ఉండేవాణ్ని చెప్పుకొచ్చారు. రాజకీయ పార్టీ నిర్వహణలో డిక్టేటోరియల్ ఆటిట్యూడ్ ఉండకూడదని అన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనతో కేడర్‌ను పట్టించుకోలేదని అన్నాడు. కేడర్‌ను పట్టించుకోకపోవడం ఏ పార్టీకీ మంచిది కాదని అన్నారు. జగన్‌కు చెందిన తాడేపల్లి పార్టీ క్యాంపు ఆఫీసు, నివాసం నిర్మాణం తన కుమారుడి ఆధ్వర్యంలోనే జరిగిందని అన్నారు. తొలుత అది విల్లాల కోసం స్టార్ట్ చేసిన ప్రాజెక్టు అయినప్పటికీ పార్టీ ఆఫీసు ఉంటే బాగుంటుందని తానే చెప్పినట్టు ఆదిశేషగిరిరావు అన్నారు. అయితే, ప్లాట్ల కేటాయింపు, నిర్మాణ సమయంలో జగన్ అక్కడకు రాలేదని, గృహప్రవేశానికి మాత్రమే వచ్చాడని తెలిపారు. జగన్ పేరు మీద సైటు కొని నిర్మాణ పనులు చేపట్టామని, ఇందుకు సంబంధించిన కాంట్రాక్ట్ తమకు ఇచ్చారని అన్నారు.

## లైన్ మెన్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 9 లక్షలు వసూలు చేసిన కార్పొరేటర్.

తాజాగా నెల్లూరు జిల్లాలో ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకున్న సంఘటన ఉదాంతం బయటకు వచ్చింది. విద్యుత్ శాఖలో లైన్ మెన్ ఉద్యోగం ఇప్పిస్తామని నెల్లూరు పట్టణంలోని 37 వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస యాదవ్ ఇద్దరు వ్యక్తుల నుండి ఏకంగా రూ 9.3 లక్షల రూపాయలను వసూలు చేసినట్లు సమాచారం. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన తర్వాత ఇప్పుడు ఉద్యోగం ఇప్పించకుండా నేడు కనీసం సమాధానం కూడా చెప్పడం లేదని పట్టణంలోని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ లో ఇద్దరు యువకులు శనివారం ఫిర్యాదు చేశారు.